సాక్షి
అనంతపురం
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



టమాట కిలో రూ.47
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.38 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



గ్రానైట్.. రైట్‌రైట్!
జిల్లాలో గ్రానైట్ మాఫియా రెచ్చిపోతోంది. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని 'చీకటి' వ్యాపారానికి తెరలేపింది. విలువైన ఖనిజ సంపదను దోచుకెళుతోంది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.5°/23.7°
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు డివిజన్ స్థాయిలో 'సమస్యల పరిష్కార వేదిక'

- కలెక్టరేట్‌లో యథావిధిగా గ్రీవెన్స్



అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం అనంతపురం రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించనున్నారు. అదే క్రమంలో కలెక్టరేట్‌లో యథావిధిగా పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్న డివిజన్ స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పాల్గొంటారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పించవచ్చని పరిష్కార వేదిక ఇన్‌చార్జ్ వాణిశ్రీ తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ముమ్మరంగా 'కార్డెన్‌సెర్చ్'



గడ్డివామిని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో ఆదివారం ముమ్మరంగా కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సీఐలు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్ల ఇళ్లతో పాటు ఇతర రాష్ట్రాల మద్యం, నాటు సారా, గుట్కా తదితర పాత కేసుల్లోని నిందితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. గ్రామ సభలు నిర్వహించి ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. అల్లర్లకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడమే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

రైళ్లలో విస్తృత తనిఖీలు



జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతపురం: డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా అనంతపురంలో పోలీసులు రైళ్లలో తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్‌ను పసిగట్టడంలో శిక్షణ పొందిన షైనీ జాగిలం ద్వారా జిల్లా కేంద్రం గుండా వెళ్లే రైళ్లలో త్రీ టౌన్ పోలీసులు విస్తృతంగా గాలింపు నిర్వహించారు. ఎస్పీ కే. జగదీష్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ గోపాలుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, బాంబు డిస్పోజల్ బృందం, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా తనిఖీలు కొనసాగాయి. అనుమానస్పద వ్యక్తులు, వారి లగేజీలను కూడా జాగిలం ద్వారా తనిఖీ చేశారు.

గర్భగుడిపై పిడుగు




తనకల్లులో పిడుగుపాటుకు సాయిబాబా ఆలయ గోపురానికి పడిన రంధ్రం

తనకల్లు: మండల కేంద్రం తనకల్లులోని సాయిబాబా గర్భగుడిపై పిడుగు పడింది. ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో గర్భగుడిపై భారీ శబ్దంతో పిడుగు పడడంతో గోపురానికి రంధ్రం పడింది. పిడుగు పడిన సమయంలో ఆలయ సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఇష్టారాజ్యం.. బదిలీ బేరం

డీఆర్‌డీఏ, పరిశ్రమల శాఖలో బదిలీల పర్వం ఉద్యోగులను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేల ఇళ్లచుట్టూ పడిగాపులు కాయాల్సి రావడం ఒక ఎత్తయితే, బదిలీల కోసం సంబంధిత అధికారులు కూడా రూ. లక్షల్లో డిమాండ్ చేస్తుండడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంతటి రాజకీయ జోక్యం, డబ్బు వసూళ్లు గతంలో ఎన్నడూ చూడలేదని వాపోతున్నారు. కూటమి సర్కారు కొలువుదీరిన వంద రోజుల్లోనే అసలు సంగతి గ్రహించామని, 'కోరి తెచ్చుకున్న ఖర్మ' చందాన ఉందంటూ గగ్గోలు పెడుతున్నారు.

- డీఆర్‌డీఏలో దారుణంగా బదిలీల ప్రక్రియ
- ముందుగా దూర ప్రాంతాలకు బదిలీ ఆదేశాలు
- ఉద్యోగి దారికొచ్చి డబ్బు ముట్టజెబితే కోరిన చోటకు పోస్టింగ్
- ఆర్డర్లు ఇప్పటికీ తీసుకోని చాలా మంది ఉద్యోగులు
- ఏపీడీ ఆధ్వర్యంలో వసూళ్ల పర్వం సాగుతోందని ఆరోపణలు
- పరిశ్రమల శాఖలోనూ ఇదే దుస్థితి
- గగ్గోలు పెడుతున్న ఉద్యోగులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి ఏజెన్సీ)లో బది'లీలలు' శ్రుతిమించాయి. ఒక్కో పోస్టుకు లక్ష రూపాయల బేరం పెట్టారు. శ్రీ సత్యసాయి, అనంతపురం రెండు జిల్లాలకు సంబంధించి అనంతపురం నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బదిలీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకూ అనంతపురంలో పనిచేస్తున్న ఉద్యోగులను పుట్టపర్తికి బదిలీ చేశారు. పుట్టపర్తిలో పనిచేసే వారిని 'అనంత'కు వేశారు. దీంతో అలాంటి వారు ఆర్డర్ లెటర్లు తీసుకోలేదు. ముందు దూర ప్రాంతాలకు బదిలీ ఆదేశాలిస్తారని, ఆ తర్వాత ఉద్యోగి దారికొచ్చి డబ్బు ముట్టజెబితే ఆదేశాలు మార్చి కావాల్సిన చోట పోస్టింగ్ ఇస్తున్నట్లు సమాచారం.

ఏపీడీ ఆధ్వర్యంలో వసూళ్లు!

బదిలీ ఆర్డర్లు తీసుకోని ఆయా ఉద్యోగులను అనంతపురం డీఆర్‌డీఏ కార్యాలయానికి పిలిపించి ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. తాజాగా పుట్టపర్తి నుంచి అనంతపురం వచ్చిన ఒక సీనియర్ అసిస్టెంట్ రూ. లక్ష ఇచ్చినట్టు సమాచారం. వచ్చే నెల 5 వరకూ గడువు ఉండటంతో రోజూ కార్యాలయంలో ఉద్యోగులు వసూళ్ల పర్వంపైనే చర్చించుకుంటున్నారు. గ్రామీణాభివృద్ధిలో కీలక విభాగమైన డీఆర్‌డీఏలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో వసూళ్ల పర్వం సాగుతోందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈయనకు కార్యాలయ సూపరింటెండెంట్ జిలాని, హెచ్‌ఆర్ శ్రీనివాసులు, ఫైనాన్స్ విభాగం చూస్తున్న మజ్జిగ సత్యనారాయణ సహకరిస్తున్నట్టు బదిలీ అయిన ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే తీవ్ర అవినీతి ఆరోపణలున్న పీడీ ఓబుళమ్మ బదిలీ ఆదేశాలొచ్చినా ఇప్పటికీ రిలీవ్ కాకపోవడం గమనార్హం.



అనంతపురంలోని డీఆర్‌డీఏ కార్యాలయం

అసలు పరిపాలన ఉందా..?

అన్ని విభాగాల్లోనూ బదిలీల పర్వం ప్రహసనంలా తయారైంది. ఇప్పటికే వీఆర్‌ఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల్లో తీవ్ర గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 'సాక్షి'తో కలెక్టరేట్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో అసలు పరిపాలన సరిగానే సాగుతుందో.. లేదో తెలియడం లేదని అనడం గమనార్హం. దీన్ని బట్టి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పరిశ్రమల శాఖలోనూ అంతే..

డీఆర్‌డీఏ తరహాలోనే పరిశ్రమల శాఖలోనూ వసూళ్ల పర్వం సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల లెటర్లు తెస్తున్నా, పైస్థాయి అధికారుల ఇష్టాన్ని బట్టి బదిలీ జరుగుతోంది. డబ్బు లేనిదే పని కావడం లేదని ఓ ఉద్యోగి వాపోయారు. ఈనెల 22కే గడువు ముగిసినా పాత తేదీలు వేసి ఇప్పటికీ ఆర్డర్లు ఇస్తున్నారని శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి వాపోయారు. '20 ఏళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నాం, ఇంత దుర్మార్గంగా ఎప్పుడూ ఎవరూ వ్యవహరించలేదు' అంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

పురుగుల మందు పిచికారీలో అజాగ్రత్త.. కౌలు రైతు మృతి



విజయకుమార్ (ఫైల్)

కణేకల్లు: పురుగుల మందు పిచికారీ చేసే సమయంలో అజాగ్రత్త కారణంగా ఓ రైతు ప్రాణం గాల్లో కలిసిపోయింది. వరిచేలుకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న క్రమంలో విష వాయువును పీల్చిన ఓ కౌలు రైతు ప్రాణాలొదిలిన విషాద సంఘటన కణేకల్లు మండలంలోని మాల్యం గ్రామంలో చోటు చేసుకొంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన మేరకు.. మాల్యం గ్రామానికి చెందిన హరిజన విజయకుమార్ (40), శివమ్మ దంపతులు. వీరికి నలుగురు కుమార్తెలు సంతానం. అదే గ్రామంలో విజయకుమార్‌గౌడ్‌కు చెందిన 4 ఎకరాల పొలాన్ని తన స్నేహితులు రామన్న, వన్నూరుస్వామితో కలిసి విజయ్‌కుమార్ కౌలుకు తీసుకున్నాడు. పొలంలో ప్రస్తుతం వరి పంట సాగులో ఉంది. ఆదివారం వరిచేలుకు పురుగుల మందు స్ప్రే చేయడానికి స్నేహితులతో కలిసి విజయ్‌కుమార్ వెళ్లాడు. మందు పిచికారీ సమయంలో ముఖానికి టవాల్ చుట్టుకోవడం లేదా మాస్క్ ధరించాల్సి ఉన్నా.. విజయకుమార్ జాగ్రత్తలు పాటించకుండానే పిచికారీ చేయడం ప్రారంభించాడు. కొంతసేపటికే తనకు కళ్లు తిరుగుతున్నాయని, ఊపిరి పీల్చడం కష్టంగా ఉందని చెప్పడంతో స్నేహితులు వెంటనే కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళ్లగా..పరీక్షించిన డాక్టర్లు మార్గమధ్యంలోనే విజయ్‌కుమార్ చనిపోయినట్లు ధ్రువీకరించారు. కుటుంబ పెద్దమృతితో తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇదీ అసలైన 'బాదుడు'..



ఒక్కో గొర్రె, మేకకు రూ.50 చొప్పున చెల్లించాలని కలెక్షన్ కౌంటర్ వద్ద కట్టిన ఫ్లెక్సీ



పశువుల సంత

- పశువులు, జీవాల సంతలో వసూలు చేసే రుసుం రెండింతలు
- రైతులు, కాపర్ల నడ్డి విరిచేలా కూటమి సర్కారు నిర్ణయం

అనంతపురం అగ్రికల్చర్: బాదుడే బాదుడంటూ గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుపై దుష్ప్రచారం సాగించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి 100 రోజుల్లోనే అసలైన బాదుడుకు దిగారు. అనంతపురంలో ప్రతి శనివారం జరిగే జీవాల సంతలో ఒక్కో జీవానికి వసూలు చేసే రుసుం రూ.30 నుంచి రూ.50కు పెంచారు. అలాగే ఆదివారం జరిగే సంతలో ఒక్కో పశువుకు రుసుంను రూ.100 నుంచి రూ.200కు తీసుకెళ్లారు. ఇలా ఒకే దఫా ఏకంగా రెట్టింపు స్థాయిలో బాదుడుకు దిగడంపై రైతులు, కాపర్ల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏకపక్షంగా పెంపు...

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రతి శనివారం గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత జరుగుతుంది. ఆదివారం ఆవులు, గేదెలు, ఎద్దుల సంత నిర్వహిస్తున్నారు. రాయలసీమ పరిధిలో అతి పెద్ద జీవాలు, పశువుల సంతగా పేరుంది. ప్రతి వారం రూ.కోట్లలో క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచి జీవాలు, పశువులు తరలిస్తుంటారు. ఐదేళ్లుగా మార్కెట్‌యార్డు సంతలో జరిగే క్రయ విక్రయాలకు ఒక్కో గొర్రె లేదా మేక లేదా పొట్టేలుకు రూ.30 ప్రకారం ఫీజు వసూలు చేసేవారు. అలాగే ప్రతి ఆవు లేదా ఎద్దు లేదా గేదెకు రూ.100 ప్రకారం రుసుం కట్టించుకునేవారు. ఇలా ప్రతి వారం అనంతపురం మార్కెట్ యార్డులో జరిగే పశువులు, జీవాల సంత ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. అయితే, కూటమి సర్కారు ఏర్పడిన వంద రోజుల్లోనే ఆదాయం పెంచుకునేందుకంటూ సాధారణ కాపర్ల నడ్డివిరిచే కార్యక్రమానికి దిగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరువు పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఏకపక్షంగా రుసుం పెంచడం సరికాదంటున్నారు. దళారులు, వ్యాపారులతో సంబంధం లేకుండా కనీసం రైతుల నుంచి అయినా సాధారణ రుసుం వసూలు చేయాలని కోరుతున్నారు.

హైవేపై ఆర్తనాదాలు

- గార్లదిన్నె మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఐషర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- 16 మందికి గాయాలు
- విషమంగా ముగ్గురి పరిస్థితి



నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం



తీవ్రంగా దెబ్బతిన్న ఐషర్







అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గార్లదిన్నె: హైవేపై ఆర్తనాదాలు మిన్నంటాయి. గాయపడిన వారి హాహాకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఐషర్‌ను ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో 16 మంది గాయపడ్డారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. గార్లదిన్నె మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు.. మహబూబ్ నగర్ జిల్లా ఆత్మకూరు మండలంలోని బి.కొత్తకోట పాలెంకు చెందిన 30 మంది కూలీలు ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరు వెళ్లారు. పనులు ముగియడంతో శనివారం రాత్రి అక్కడి నుంచి ఐషర్‌లో తిరుగుపయనమయ్యారు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో గార్లదిన్నె మండలం తలగాచిపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద ఐషర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఏపీఎం ట్రావెల్ బస్సు వెనుక నుంచి వేగంగా ఐషర్‌ను ఢీకొంది. ప్రమాదంలో బస్సు క్లీనర్, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఉమాంద తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, ఐషర్‌లో ప్రయాణిస్తున్న మేస్త్రీ గౌతమ్‌కుమార్, ఆయన భార్య జ్యోతికి నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కూలీలు లక్ష్మి, రాఘవ, జయమ్మ, చంద్రదుర్గ, కుమార్ దాస్, జ్యోతమ్మ, చంద్రాయుడు, మనెమ్మ, శీను, అనుషా, శ్రీషాల్, చంద్రన్న, సత్యమ్మ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చుట్టూ చిమ్మ చీకటిగా ఉండడం, ఊహించని ప్రమాదంలో గాయపడటంతో కూలీలు హాహాకారాలు చేశారు. అటుగా ప్రయాణిస్తున్న వాహనదారుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. బస్సులో ఉన్న ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్‌కు పంపించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గౌతమ్‌కుమార్, ఆయన భార్య జ్యోతిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ఈ క్రమంలో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చూడముచ్చట.. ప్రమాదం దాగుందచట



రాప్తాడు మండలం గొల్లపల్లి వద్ద హైవే పక్కన విద్యుత్ పోల్‌కు చుట్టుకున్న తీగలు



అనంతపురం నుంచి వరిమడుగు గ్రామానికి వెళ్లే రోడ్డులో..

కరెంటు పోళ్లకు చుట్టుకున్న ఈ తీగలు చూడముచ్చటగా కనిపిస్తున్నా వాటి వెనకే ప్రమాదం దాగుంది. తెలియకుండా ఎవరైనా తీగలను పట్టుకుంటే ప్రాణాలే కోల్పోయే పరిస్థితి నెలకొంది. దీనికితోడు తీగలు ఎండిపోయాక చిన్న షార్ట్ సర్క్యూట్ సంభవించినా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. రహదారిపై బస్సులు, భారీ వాహనాల్లో సరుకులు తరలిస్తుంటారు. ఇటువంటి తరుణంలో ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితి. విద్యుత్ శాఖ అధికారులు మేలుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

యువకుడిపై టీడీపీ శ్రేణుల దాడి



వాల్మీకి సర్కిల్‌లో పోలీసు బందోబస్తు

కళ్యాణదుర్గం: పట్టణానికి చెందిన సంతోష్ అనే యువకుడిపై టీడీపీ శ్రేణులు మూకుమ్మడిగా దాడి చేశాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. కళ్యాణదుర్గం మండలం పాలవాయికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు కొంత కాలంగా గుట్టుగా పేకాట స్థావరాలను నిర్వహిస్తున్నాడు. ఇటీవల బెళుగుప్ప మండలం కోనాపురం వద్ద పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో సంతోష్ ప్రమేయం ఉందనే అనుమానంతో కోనాపురానికి చెందిన పేకాట నిర్వాహకుడు గోపీతో పాలవాయికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు చర్చించాడు. ఎలాగైనా సంతోష్‌ను కొట్టాలని పథకం వేశాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి సంతోష్‌కు ఫోన్ చేసి నానా దుర్భాషలాడాడు. అనంతరం పలువురు పేకాట రాయుళ్లు, పాలవాయి గ్రామానికి చెందిన కొందరు యువకులతో కలిసి కళ్యాణదుర్గం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న సంతోష్‌పై దాడికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అరగంటకు పైగా వాహనాలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే సమయానికి టీడీపీ నాయకులు అక్కడి నుంచి పరారయ్యారు. పేకాట స్థావరాలు బంద్ కావడంతో అక్కసు పెంచుకుని ఇలా దాడులకు దిగుతున్నారని స్థానికులు అంటున్నారు.

జిల్లాలో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. బ్రహ్మసముద్రం 28 మి.మీ, కళ్యాణదుర్గం 25.2 మి.మీ, గుమ్మఘట్ట 24.6 మి.మీ, శెట్టూరు 24.2 మి.మీ, రాయదుర్గం 15.2 మి.మీ, వజ్రకరూరు 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అనంతపురం, ఆత్మకూరు, పెద్దవడుగూరు, కంబదూరు, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, కుందుర్పి, శింగనమల తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. సెప్టెంబర్ సాధారణం 110.9 మి.మీ కాగా 56 శాతం తక్కువగా 44.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి 310.8 మి.మీ గానూ 37 శాతం అధికంగా 427.1 మి.మీ నమోదైంది.

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి


ఆదినారాయణ (ఫైల్)

పెద్దపప్పూరు: స్థల వివాదంలో తోపులాట చోటు చేసుకుని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం నరసాపురం గ్రామ ఎస్సీ కాలనీలో ఆదిరానాయణ (42), వెంకటేష్ ఎదురెదురు ఇళ్లలో నివాసముంటున్నారు. శనివారం అర్ధరాత్రి తమ ఇంటి ఎదురుగా మూత్ర విసర్జన చేస్తున్న వెంకటేష్‌ను ఆదినారాయణతో పాటు ఆయన కుటుంబసభ్యులు మందలించారు. ఆ సమయంలో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని తోపులాటకు దారి తీసింది. కింద పడి అపస్మారక స్థితికి చేరుకున్న ఆదినారాయణను కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఎరికలమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గౌస్‌బాషా తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

కళ్యాణదుర్గం రూరల్: మహిళా సంఘాలకు చెందిన రూ.72 లక్షలు స్వాహా చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లి పరిధిలోని పలు సంఘాలకు చెందిన పొదుపు ఖాతాల్లో నుంచి సుమారు రూ.72 లక్షలకు పైగా నగదు స్వాహా చేసిన అంశంపై బాధితులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు నగదు స్వాహా చేసిన ఎర్రిస్వామి, లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ, హనుమంతరాయుడు, వరలక్ష్మిపై ఆదివారం కేసు నమోదు చేశారు.

ముగిసిన యూటీఎఫ్ ఆవిర్భావ మహోత్సవాలు


చెస్ పోటీలో పాల్గొన్న మహిళా టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన స్వర్ణోత్సవాలు ఆదివారం ముగిశాయి. అనంతపురంలోని శారదా నగర పాలక ఉన్నత పాఠశాలలో ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడారు. యూటీఎఫ్ ఆవిర్భవించిన నాటి నుంచి ఉపాధ్యాయుల శ్రేయస్సే లక్ష్యంగా అనేక పోరాటాలు సాగిస్తూ వస్తోందన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ అగ్రస్థానంలో ఉందన్నారు. అనంతరం స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలను అభినందిస్తూ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, గౌరవాధ్యక్షుడు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, జిల్లా కార్యదర్శులు ప్రమీల, సంజీవ్ కుమార్, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ పాల్గొన్నారు.

గ్రానైట్.. రైట్‌రైట్!

- పర్మిట్ లేకుండా రవాణా
- రాత్రి వేళల్లో ఎంచక్కా తరలింపు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి


ఈ గ్రానైట్ రాయి వాస్తవ టన్నేజీతో కాకుండా అధిక బరువుతో రాత్రి వేళ బళ్లారి రోడ్డు దాటుకుని రాయదుర్గం మీదుగా అనంతపురం వైపు వెళ్తోంది. ఎలాంటి పర్మిట్లు పొందకుండా అధికారుల కళ్లుగప్పి విలువైన ఖనిజ సంపద దోచుకెళుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు.


గ్రానైట్ లోడ్ కలిగిన ఈ లారీ ప్రమాదకరంగా వెళ్తోంది. రాయికి రెండు వైపులా చైన్‌బెల్టు ఏర్పాటుచేసి కదలకుండా బిగించాలి. పొరపాటున ఒక వైపు ఒరిగినా రాయి కిందపడకుండా ముందస్తు జాగ్రత్త పాటించాలి. ఈ నిబంధనలు తుంగలోతొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రాయదుర్గం: జిల్లాలో గ్రానైట్ మాఫియా రెచ్చిపోతోంది. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని 'చీకటి' వ్యాపారానికి తెరలేపింది. నిబంధనలు తుంగలోతొక్కి విలువైన ఖనిజ సంపదను దోచుకెళుతోంది. ఒకే బిల్లుపై ఎక్కువ ట్రిప్పులు తరలిస్తూ రాయల్టీలకు ఎగనామం పెట్టేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లల్లో గండి కొడుతోంది. రాత్రి పది దాటగానే గ్రానైట్ లారీలు రోడ్డెక్కుతున్నాయి. అన్నీ సక్రమంగా ఉంటే ఈ చీకటి దందా కొనసాగించాల్సిన అవసరం ఉండేది కాదని స్థానికుల్లో అనుమానం రేకెత్తింది.

ఇక్కడి గ్రానైట్‌కు డిమాండ్ ఎక్కువ

జిల్లాలో అనుమతి పొందిన వైట్, బ్లాక్ గ్రానైట్ క్వారీలు 32 ఉన్నాయి. ఇవన్నీ రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనే వెలిశాయి. వీటి పరిసరాల్లో లభించే గ్రానైట్ రాయికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటోంది. దీన్ని అదునుగా తీసుకున్న వ్యాపారులు అడ్డగోలుగా తవ్వేస్తూ దోపిడీకి తెరతీస్తున్నారు. చాలాచోట్ల తక్కువ క్యూబిక్ మీటర్లకు అనుమతులు పొంది ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో రాయదుర్గం మండలం చదం గేటు దాటుకుని బళ్లారి రోడ్డు నుంచి పట్టణం మీదుగా అనంతపురం వైపు లారీల్లో గ్రానైట్ తరలుతోంది. గుమ్మఘట్ట మండలంలోని పలు క్వారీల్లో లభ్యమయ్యే బ్లాక్, వైట్ రాయి కూత వేటు దూరంలోని కర్ణాటకకు తరలుతోంది. కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. రాయి రవాణా సమయంలో నిబంధనలు పాటించడం లేదు. భారీ గ్రానైట్ రాయి ఏమాత్రం ఒరిగినా మూల్యం తప్పదు. ఇటీవల రాయదుర్గం సమీపాన అనంతపురం దారిలో గ్రానైట్ లారీ పంక్చర్ కావడంతో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది.

పేలుళ్లతో బెంబేలు

గ్రానైట్ రాయి వెలికి తీసేందుకు క్వారీ నిర్వాహకులు భారీగా పేలుడు పదార్థాలు (జిలెటిన్‌స్టిక్స్), ఇతర మందుగుండు సామగ్రి వినియోగిస్తున్నారు. వాటి శబ్దాలకు సమీప గ్రామల ప్రజలు భీతిల్లిపోతున్నారు. కొన్ని క్వారీల్లో నిపుణుల పర్యవేక్షణ లేకుండానే పేలుళ్లు చేపడుతున్నట్టు తెలుస్తోంది. అవగాహన లోపం కారణంగా కొందరు పేలుడు సామగ్రిని ఆరుబయటే వదిలేస్తున్నారు. ఇటీవల సోమలాపురం సమీపాన ఓ స్టోన్ క్వారీ సమీపాన గొర్రెల కాపరి జిలెటిన్ స్టిక్ పట్టుకుని ప్రమాదం బారినపడ్డాడు. క్వారీలకు జిలెటిన్‌స్టిక్స్ సరఫరాచేసే భారీ మ్యాగజైన్ గుమ్మఘట్ట మండలం అడిగుప్ప వద్ద అధికారులు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి ఇష్టారీతిన మందుగుండు సామగ్రి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది.

నిబంధనలు బేఖాతరు

గ్రానైట్ తరలించే లారీలు ఒక్కోదానికి ఒక్కో విధంగా ట్యాక్స్ చెల్లించాల్సి ఉంది. 10 టైర్ల ట్రక్కులో 25 టన్నులు, 12 టైర్ల ట్రక్కులో 32 టన్నులు, 14 టైర్ల ట్రక్కులో 35 టన్నులు, 18 టైర్ల ట్రక్కులో 42 టన్నులు, 22 టైర్ల ట్రక్కులో అయితే 50 టన్నుల రాయిని తరలించవచ్చు. ఇలా ప్రతి రాయికీ అధికారుల సమక్షంలో కొలతలు తీసి నంబర్లు వేయాలి. దాని ఆధారంగా రాయల్టీలు చెల్లించి రాయి తీసుకెళ్లాలి. అయితే ఈ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు. లారీ సామర్థ్యం కంటే అదనంగా తరలిస్తున్నారు. అధిక లోడుతో వాహనాలు ఇష్టారాజ్యంగా తిరగడం వల్ల ఈ మార్గంలో రోడ్లు ధ్వంసమవుతున్నాయి.

అనుమతుల్లేకుండా తరలిస్తే చర్యలు

రాయల్టీలు చెల్లించకుండా గ్రానైట్‌ను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు. పోలీసు, వాహనాల తనిఖీ (ఆర్టీఓ)లను సమన్వయం చేసుకుని క్వారీ ప్రాంతాల్లో తనిఖీలు చేపడతాం. నిబంధనలు పాటించని యజమానులపై ఉక్కుపాదం మోపుతాం. నంబర్ లేకుండా రాయి తరలిస్తే లారీలు సీజ్‌చేస్తాం. యజమానులు గమనించాలి. అక్రమ రవాణాను స్థానికంగా అధికారులు అడ్డుకుని మా దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపడతాం.

– నాగయ్య, మైనింగ్ డీడీ, అనంతపురం

భర్తే కాలయముడయ్యాడు


జ్యోతమ్మ (ఫైల్)

గుమ్మఘట్ట: కలకాలం తోడూ నీడగా ఉంటానని ప్రమాణం చేసి తాళి కట్టిన భర్తే ఆమె పాలిట కాలయముడయ్యాడు. ఆదమరచి నిద్రిస్తున్న భార్యను కుటుంబ కలహాల నేపథ్యంలో గొంతు కోసి కడతేర్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన నరసింహులు, ఓబక్క దంపతుల కుమార్తె జ్యోతమ్మ (28)కు తొమ్మిదేళ్ల క్రితం గలగల గ్రామానికి చెందిన వన్నూరుస్వామితో వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న వీరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో జ్యోతమ్మ పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో పెద్దలు రాజీ చేయడంతో ఐదు నెలల క్రితం కాపురానికి వెళ్లింది. ఇటీవల మారెమ్మ పండుగకు పుట్టింటికి జ్యోతమ్మ వెళ్లింది. నెల రోజులు కావస్తున్న ఆమె కాపురానికి వెళ్లలేదు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న వన్నూరుస్వామి శనివారం మధ్యాహ్నం కలుగోడులోని అత్తింటికి చేరుకున్నాడు. సాయంత్రం వరకూ భార్యతో సరదగా గడిపాడు. ఆదివారం తెల్లవారుజామున 4గంటల సమయంలో నిద్రలో ఉన్న భార్య గొంతు కోసి హతమార్చి అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు గమనించేలోపు గ్రామం దాటి వెళ్లిపోయాడు. విగతజీవిలా పడి ఉన్న కుమార్తెను చూసి కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ ఈశ్వరయ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తలసేమియా బాధిత విద్యార్థికి చేయూత

- రూ.17 వేలు ఆర్థిక సాయం
- విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన కలెక్టర్ వినోద్‌కుమార్

గార్లదిన్నె: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న గార్లదిన్నె మండలం పాత కల్లూరుకు చెందిన సురేంద్ర, సుజాత దంపతుల కుమారుడు శ్రీకాంత్‌కు పలువురు దాతలు అండగా నిలిచారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌కు రక్తం ఎక్కించిన ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఆపరేషన్ అత్యవసరమని అక్కడి వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.18 లక్షల వరకు ఖర్చు వస్తుందని వైద్యులు తెలపడంతో చేతిలో చిల్లిగవ్వలేని నిరుపేద కుటుంబ దీనస్థితిపై 'ఆస్పత్రి వద్దు... బడికి వెళ్తా నమ్మా' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై పలువురు దాతలు స్పందించారు.

సాక్షి ఎఫెక్ట్..

ఇప్పటికే పలువురు దాతలు... బాధిత విద్యార్థి కుటుంబసభ్యుల ఫోన్ పే 90145 15056, 81067 51483 నంబర్లకు రూ.17 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కాగా, విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ వినోద్‌కుమార్ సైతం స్పందించారు. జిల్లా వైద్యాధికారుల ఆదేశాలతో బెంగళూరులోని ఆస్పత్రిలో ఉన్న బాధిత తల్లిదండ్రులకు ఆరోగ్యశ్రీ సిబ్బంది ఫోన్ చేసి శ్రీకాంత్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రైతు చిరంజీవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాప్తాడు: విద్యుత్ షాక్‌కు గురై యువ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం భోగినేపల్లికి చెందిన చిన్న మాదన్న, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ఎం.చిరంజీవి (39) వ్యవసాయంతో కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. తమకున్న తోటలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వరి పైరు సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వరి పైరుకు నీరు పెట్టేందుకు తోటకు వెళ్లాడు. మోటార్ స్విచ్ ఆన్ చేసేందుకు వెళుతుండగా వర్షం మొదలైంది. వర్షంలోనే తడుస్తూ స్టార్టర్ స్విచ్ నొక్కే ప్రయత్నం చేస్తుండగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రమైన కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు తోట వద్దకెళ్లి పరిశీలించారు. విగత జీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి బోరున విలపించారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారిని కంట తడిపెట్టించింది. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లోగుట్టు పెద్ద మేడమ్‌కు ఎరుక

- రహస్యంగా సమగ్ర శిక్ష సెక్టోరియల్ పోస్టుల భర్తీ ప్రక్రియ
- అభ్యర్థులకు 1న ఇంటర్వ్యూలు
- నేటికీ ఈ విషయం బయటకు చెప్పని అధికారులు
- అస్మదీయుల కోసం ఆరాటపడుతున్న ఓ అధికారి
- ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న కలెక్టర్



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీని అధికారులు అత్యంత గోప్యంగా ఉంచారు. ఏ చిన్న విషయమూ బయటకు పొక్కకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవడంతో దరఖాస్తుదారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో లోగుట్టు ఏమిటో డీఈఓకు తప్ప మరెవ్వరికీ తెలియదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతా గందరగోళమే..

ఓ అధికారి నిర్వాకం కారణంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పలువురిని కొంత కాలం క్రితం రిలీవ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయా పోస్టుల భర్తీకి ఆగమేఘాల మీద నోటిఫికేషన్ ఇచ్చారు. ఏఎంఓ, జీసీడీఓ, అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, ఏఎస్ఓ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కాగా, ఈ పోస్టులకు 110 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల పరిశీలన వరకు మొత్తం ప్రక్రియ గందరగోళంగా తయారైంది. దీంతో అభ్యర్థుల్లోనూ తీవ్ర ఆందోళన నెలకొంది.

బయటపెట్టని అర్హుల జాబితా..

స్వయంగా విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన నిబంధనలను అనుసరించి సమగ్ర శిక్షలో పోస్టుల భర్తీ చేయాల్సి ఉంది. అర్హులైన వారి జాబితాను రూపొందించి కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్ర కార్యాలయానికి పంపాల్సి ఉంది. కమిషనర్ పరిశీలించి ఆమోదం తెలిపిన తర్వాతనే ఎంపికైన వారు ఆయా పోస్టుల్లో చేరాల్సి ఉంటుంది. వాస్తవానికి స్కూల్ వర్కింగ్ రోజుల్లో ఎవరినీ రిలీవ్ చేయకూడదు. కొత్తవారిని జాయిన్ చేసుకోకూడదు. ఈ మొత్తం సెలవు దినాల్లోనే జరగాలనేది కమిషనర్ జారీ చేసిన నిబంధనల్లో స్పష్టంగా ఉంది. ఈ నిబంధనలకు జిల్లా అధికారులు పాతరేశారు. వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేశారు. నిబంధనల మేరకు ఎవరు అర్హులో... ఎవరు అనర్హులో బయటకు చెప్పడం లేదు. అర్హుల జాబితాను ప్రకటించి అందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి తర్వాత మార్పులు చేర్పులు చేయాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియను కూడా అధికారులు నిర్వహించలేదనే ఆరోపణలున్నాయి.

టీడీపీ నేతల ఒత్తిళ్లు..

సమగ్ర శిక్షలో పోస్టుల భర్తీ అంశంలో అస్మదీయుల కోసం టీడీపీ నేతల ఒత్తిళ్లు తీవ్రమయ్యాయి ఇప్పటికే పలువురు సిఫారసు లేఖలు కూడా సమర్పించారు. మరికొందరి గురించి స్వయంగా అధికారులకు ప్రజాప్రతినిధులు ఫోన్లు చేసి చెబుతున్నారు. ఈ క్రమంలో ఓ అధికారి మరింత అత్యుత్సాహం కనబరుస్తూ అందిన దరఖాస్తుల్లో అర్హులు, అనర్హుల జాబితాను బయట పెట్టకుండా తొక్కి పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. స్క్రూటినీ తర్వాత అర్హులు, అనర్హుల జాబితాను సమగ్ర శిక్ష కార్యాలయానికి సంబంధం లేని డీఈఓ కార్యాలయ సిబ్బందితో డీపీసీ, డీఈఓ వరలక్ష్మి పరిశీలింపజేయడం పెద్ద దుమారం రేపింది. ఆ సమయంలోనే అనర్హుల జాబితాలో ఉన్న కొందరి పేర్లను అర్హుల జాబితాలోకి చేర్చినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారం కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి వెళ్లడంతో నిబంధనల మేరకు దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించినట్లు తెలిసింది. మరో రెండు రోజుల్లో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

పాలక వర్గం ఆలోచనల్లో మార్పురావాలి


సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వి.కె.రామచంద్రన్


హాజరైన ప్రతినిధులు, నాయకులు

- అధికార మార్పిడితో సమసమాజ స్థాపన జరగదు
- లెనిన్ శతవర్ధంతి సభలో ప్రొఫెసర్ వి.కె.రామచంద్రన్

అనంతపురం అర్బన్: అధికార మార్పిడి జరిగినంత మాత్రాన సమాసమాజ స్థాపన సాధ్యం కాదని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ వి.కె.రామచంద్రన్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని అలేఖ్య ఫంక్షన్ హాల్‌లో లెనిన్ శతవర్ధంతి సభ జరిగింది. ముందుగా లెనిన్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద అధ్యక్షతన 'రాజ్యం... విప్లవం' అంశంపై జరిగిన సదస్సులో రామచంద్రన్ మాట్లాడారు. సమాజంలో పాలకవర్గాలన్నీ పెట్టుబడిదారీ ప్రయోజనాలను కాపాడే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ కారణంగానే సమాజంలో ఆర్థిక అసమానతలు అధికమయ్యాయన్నారు. భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం సమసమాజ భావనలు అధికంగా ఉండేవన్నారు. క్రమంగా భావనలు మారుతూ బడాపెట్టుబడి, పెట్టుబడి, భూస్వామ్య లక్షణాల పెరిగి 1991లో సరళీకరణ ఆర్థిక విధానాల అమలుతో బలపడ్డాయన్నారు. దీనికి మతతత్వం కూడా తోడై ఆర్థిక అంతరాలు మరింత పెరిగిపోతున్నాయన్నారు. ఆర్థిక అసమానతలు రూపుమాపేదిశగా సీపీఎం ముందుకెళుతోందన్నారు. దేశంలో 271 మంది బిలియనీర్లు ఉండగా ఇందులో 94 మంది గడిచిన రెండేళ్లలో కొత్తగా పుట్టుకొచ్చిన వారే కావడం గమనార్హమని రామచంద్రన్ అన్నారు. మరో వైపు పేదరికం, దారిద్ర్యం పెరుగుతోందన్నారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదని విషయాన్ని యూనెస్కో గణాంకాలు చెబుతున్నాయన్నారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. అంతరాలు పోవాలంటే పాలక వర్గం ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. సదస్సులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకుడు జి.ఓబులు, ప్రముఖులు డాక్టర్ భానుకిరణ్, ఎస్‌ఎంబాషా, గోవిందరాజులు, సత్యబోస్, రాజ్‌మోహన్, రమణయ్య, లాయర్ సతీష్, రంగనాయకులు, సత్యనారాయణరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సావిత్రి, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, నాయకులు రామిరెడ్డి, పరమేష్, జయచంద్ర, శ్రీదేవి, రామ్మకృష్ణారెడ్డి, మనోహర్, ఇర్ఫాన్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

విద్య వ్యాపారీకరణ చేస్తున్న బీజేపీ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 5 నుంచి 8వ తేదీ వరకూ అనంతపురంలో జరిగే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని వీకే రామచంద్రన్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేసే దిశగా అడుగేస్తోందని మండిపడ్డారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా రాష్ట్రాల హక్కులు కాలరాస్తోందన్నారు. దీనిని కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందన్నారు. మిగతా రాష్ట్రాలు కూడా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్ధు, జిల్లా సహాయ కార్యదర్శులు భీమేష్, శివ, వంశి, నగర నాయకులు గణేష్, సోము, సాయి, ఎస్కే యూనివర్సిటీ నాయకులు మోహన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

కణేకల్లు: విద్యుత్ షాక్‌కు గురై ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన పోతప్ప (38) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని గోపులాపురం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు జరిగిన కరెంటుషాక్ తగిలి పోతప్ప (38) ప్రవేటు వర్కర్ మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన రైతు అభ్యర్థన మేరకు గోపులాపురంలో ఓ రైతు వద్ద స్పేర్‌గా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెవచ్చేందుకు ఆదివారం వెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్ తీగలు తొలగించి వెలికి తీస్తున్న సమయంలో కరెంట్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన రైతులు వెంటనే కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాయదుర్గానికి తరలించారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి ఆయన మృతి చెందాడు. కాగా, పోతప్పకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- రైల్వే గేట్‌మెన్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


శివలింగమ్మను తీసుకెళుతున్న పోలీసులు

రాయదుర్గం టౌన్: జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే సకాలంలో గేట్‌మెన్ ఆమెను కాపాడి పోలీసులకు అప్పగించారు. వివరాలు... డి.హీరేహాళ్ మండలం నాగలాపురం గ్రామానికి చెందిన శివలింగమ్మ (48) కుటుంబ కలహాల నేపథ్యంలో ఇల్లు విడిచి ఆదివారం సాయంత్రం రాయదుర్గానికి చేరుకుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె అనంతపురం మార్గంలోని రైలు పట్టాల వద్దకు చేరుకుని రైలు వచ్చే సమయంలో పట్టాల పైకి చేరుకుంది. గమనించిన రైల్వే గేట్ మెన్ వెంటనే అప్రమత్తమై పరుగున వెళ్లి ఆమెను పక్కకు లాగేయడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం కుమారుడు వన్నూరు స్వామిని స్టేషన్‌కు రప్పించుకుని కౌన్సిలింగ్ అనంతరం తల్లిని అప్పగించారు.

గొర్రెల మందపై పిడుగు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి చెందాయి. బాధిత కాపరులు తెలిపిన మేరకు... చెర్లోపల్లి గ్రామానికి చెందిన లాలెప్ప, వెంకట్రాముడు... గొర్రెల పోషణతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో ఆదివారం గొర్రెలను మేతకు తీసుకెళ్లి సేవాగఢ్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మందను నిలిపారు. రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడడంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు తీవ్రంగా గాయపడ్డాయి. దాదాపు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా


మృతుడు హర్షవర్ధన్

తాడిపత్రి రూరల్: ఈత సరదా ఓ బాలుడి ప్రాణాలు బలిగొంది. స్థానికులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన ఉమాశంకర్ తన కుటుంబసభ్యులతో కలసి బతుకు తెరువు కోసం వలస వచ్చి సజ్జలదిన్నె సమీపంలోని కడప స్లాబ్ యూనిట్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక పంప్ హౌస్ వద్ద దుస్తులు ఉతకడానికి కుటుంబసభ్యులు వెళ్లారు. ఆ సమయంలో తన స్నేహితులతో కలసి ఉమాశంకర్ కుమారుడు హర్షవర్ధన్ (15) నీటి గుంతలో సరదాగా ఈత కొడుతూ లోతట్టు ప్రాంతానికి వెళ్లాడు. అప్పటికే అలసి పోయిన బాలుడు... ఆయాసంతో ఈద లేక నీట మునిగాడు. విషయాన్ని గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో చుట్టుపక్కల దుస్తులు ఉతుకుతున్న వారు నీటి గుంతలో గాలింపు చేపట్టి వెలికి తీసేలోపు బాలుడు మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా జీవించాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలి. ప్రజలను రెచ్చగొడితే కఠినంగా శిక్షిస్తామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. గొడవలకు దూరంగా ఉండి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, జూదం, కర్ణాటక మద్యం విక్రయాలు చేపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశాలు ఉన్నా.. కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

అనంతపురం టవర్‌క్లాక్: యువత రాజకీయాల్లోకి రావాలి. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక రాణినగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ అతి పెద్ద పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. జిల్లాలో కూడా బీజేపీ పెద్ద పార్టీగా అవతరించేందుకు యువత కృషి చేయాలన్నారు. ప్రజలు అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సంధిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు లలిత్ కుమార్, సూర్య ప్రకాష్, మనోహర్, కుళ్లాయప్ప, సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' జరగనుంది. నగరంలోని వివిధ డివిజన్లలోని ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవచ్చు. వివిధ సెక్షన్ల హెడ్లు అందుబాటులో ఉంటారని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

రాప్తాడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహిస్తున్నాం. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

చిన్న కదిరయ్య స్వామి హుండీల లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

రాప్తాడు: మరూరు గ్రామంలో వెలసిన చిన్న కదిరయ్య స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం దాదాపుగా రూ.7.82 లక్షలు వచ్చింది. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ టీ.వి. శ్రీహర్ష, తహసీల్దార్ విజయ కుమారి, ఏఎస్ఐ శ్రీరాం నాయక్, వీఆర్వో రవి పర్యవేక్షణలో లెక్కించారు. హుండీల ద్వారా సమకూరిన మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా ప్రతి శనివారం ఆలయం వద్ద అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు. కరోనా వచ్చినప్పటి నుంచి ఆలయంలో అన్నదానం బంద్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గుడి కాపులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాట మారెమ్మకు పూజలు



అలంకరణలో బాట మారెమ్మ

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి వారం చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహిస్తారని ఆలయ పూజారి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

అక్రమార్కులకు అందలం!



- నగరపాలక సంస్థలో కీలక విభాగాలకు అధికారుల కేటాయింపు
- అవినీతిలో కూరుకుపోయిన వారికి కూటమి ప్రభుత్వం అండ
- ముడుపులు సమర్పించుకున్న వారు ఎదురుచూపులు



అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అవినీతి అధికారులకు పట్టం కట్టేలా ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి ముద్ర వేసుకున్న కొందరు అధికారులను ఆగమేఘాలపై ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన విషయం విదితమే. ప్రధానంగా నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ కీలక అధికారిపై పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపించాయి. నగరంలో ఇష్టానుసారంగా భవనాల అతిక్రమణలు జరగడంలో సదరు అధికారి కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అశోక్ నగర్, హౌసింగ్ బోర్డు, ఆర్టీసీ బస్టాండ్ రాజహంస సమీప ప్రాంతం, 2, 3, 4, 5 రోడ్లు, రాంనగర్, ఆర్‌కే నగర్, కమలానగర్, రామచంద్ర నగర్, సాయి నగర్, సూర్యనగర్, సుభాష్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో భవనాలు వెలిశాయి. ఇందులోని ప్రతి భవనం అనుమతులను అతిక్రమించింది. అందులో భాగంగానే ఈ భవనాలకు చార్జ్‌షీట్ సైతం అధికారులు దాఖలు చేశారు. ఇదెలా ఉన్నా.. భవనాల అతిక్రమణల్లో టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఓ కీలక అధికారి కనుసన్నల్లోనే నిర్మాణాలు జరిగాయి. కొందరు లైసెన్స్ ఇంజినీర్లను మధ్యవర్తులుగా ఉంచి సదరు అధికారి భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

చిరు వ్యాపారులను వదలని అధికారి

టౌన్ ప్లానింగ్‌లో ఆ కీలక అధికారి చిరు వ్యాపారులను వదలలేదు. రోడ్డులో ఏదైనా చిన్నపాటి షెడ్లు, పండ్లు, పూల అంగళ్లు పెట్టుకుని జీవనం సాగించిన వారితోనూ సదరు అధికారి కక్కుర్తిగా బెడ్‌షీట్లు, పండ్లు తీసుకెళ్లాడని సాక్షాత్తూ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బందే చెబుతున్నారు. ఈ క్రమంలో అధికారి ఆగడాలు శ్రుతి మించడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారిని తిరుపతికి బదిలీ చేశారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మళ్లీ సదరు అధికారికే పట్టం కట్టేలా కొందరు ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. నగరంలో అతిక్రమణలు, ఆక్రమణలకు రెడ్ కార్పెట్ వేసేలా అధికారిని కొందరు ప్రజాప్రతినిధులు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆ అధికారి వస్తున్నారని తెలియడంతో నగరపాలక సంస్థలోనూ చర్చనీయాంశమైంది. అనుమతులు లేకున్నా.. దర్జాగా నిర్మాణాలు చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తాడని చెబుతున్నారు.

మరో అధికారి కూడా..

అదే విధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు వచ్చిన ఓ మహిళా అధికారి అనంతపురానికి బదిలీ అయినా.. ఆమెను అప్పటి కమిషనర్ భాగ్యలక్ష్మి విధుల్లోకి చేర్చుకోలేదు. ఇప్పుడు మరోమారు సదరు అధికారిణి నగరపాలక సంస్థకు రానున్నారు. ఇలా అవినీతిలో కూరుకుపోయిన వారికి ప్రభుత్వం అండగా నిలవడం పెద్ద చర్చనీయాంశమైంది.

ఇంజినీరింగ్ విభాగంలో..

అదేవిధంగా ఇంజినీరింగ్ విభాగంలోనూ కొందరు డీఈలకు కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఏసీబీకి చిక్కిన ఓ అధికారి అనంతపురంలో విధులు నిర్వర్తించేందుకు ఇప్పటికే కొందరికి అమ్యామ్యాలు సమర్పించుకున్నారు. మరో ముగ్గురు డీఈలు అనంతపురం నగరపాలక సంస్థకు రావాలని చూస్తున్నారు. వీరిపైనా గతంలో పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వంలో అవినీతికి అందలం వేసేలా చర్యలు తీసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

125 మందికి వైద్య సేవలు

రాప్తాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం 125 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

మౌనగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

రాప్తాడు: హంపాపురం సమీపంలో వెలసిన 39 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదం అందజేసినట్లు నిర్వాహకుడు ఈశ్వరయ్య స్వామి తెలిపారు.

నల్లలమ్మ ఆలయంలో..

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో వెలసిన నల్లలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల్లోని గ్యాస్ వినియోగదారులకు సోమవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 నంబర్‌లో సంప్రదించవచ్చు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

కనగానపల్లి: మండల పరిధిలోని మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు.. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో కనగానపల్లికి చెందిన సరోజమ్మ, ఆమె కుమారుడు సురేష్ అనంతపురం నుంచి మామిళ్లపల్లి వైపు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సురేష్‌తో పాటు అతడి తల్లి సరోజమ్మ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



కొత్తూరు అమ్మవారి శాలలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు



వేద గాయత్రి దేవాలయంలో దసరా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: తపోవనంలోని వేద గాయత్రి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రొద్దం అనంత్ తెలిపారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అక్టోబర్ 3 నుంచి 11 వరకూ ఉత్సవాలను పురస్కరించుకుని రోజూ హోమాలు, అష్టోత్తర శతనామ పూజలు, లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నూతనంగా నిర్మించిన సభా మంటపాన్ని 4న బ్రహ్మశ్రీ పంచాంగం సూర్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రారంభిస్తారని తెలిపారు. మూలా నక్షత్రం సందర్భంగా 9న చిన్నారులకు అక్షరాభ్యాసం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రామగోపాల్, కోశాధికారి జగన్నాథ్, మేనేజర్ సాయిప్రసాద్, కో-ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: వాసవీమాత ఆలయంలో ఈసారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గోపా మచ్చా నసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తూరు అమ్మవారి శాలలో సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 3 నుంచి 13 వరకూ అంగరంగ వైభవంగా సాగే దసరా వేడుకల పుస్తకాలు, ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మచ్చా నరసింహులు మాట్లాడుతూ.. దసరా వేడుకల్లో ఉత్సవాల అలంకరణ కోసం తమిళనాడు సేలం, హైదరాబాద్, గుంటూరు కళాకారులను రప్పించినట్లు తెలిపారు. రూ.కోటి నిధులతో ఆద్యంతం అమ్మవారి ముఖ మండపాన్ని ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టలక్ష్ములను వెండితో సుందరంగా తయారు చేయించామన్నారు. అలాగే రూ.10 లక్షల విలువ చేసే సువర్ణ ప్రభావళిని దసరా వేడుకల్లో అమ్మవారికి అలంకరిస్తున్నామని పేర్కొన్నారు. రోజు ఒక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చే వాసవీమాతను సందర్శించుకునేందుకు వేలాదిగా విచ్చే భక్తులకు ప్రత్యేకంగా ప్రసాదాన్ని తయారు చేయిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అమ్మవారి శాలను సూచించే ప్రధాన ద్వారాన్ని సుందరంగా ముస్తాబు చేస్తామన్నారు. అంతకు ముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సూర్యప్రకాష్, నాగభూషణం, తల్లం మురళీ, ఆంజనేయులు, వెంకటేష్, క్రిష్టం రఘు, సతీష్, మహిళా మండలి నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

అనంతపురం: నగర శివారులోని జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆజాద్‌నగర్‌కు చెందిన శివ, చంద్ర అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో జాతీయ రహదారి వైపు వెళ్లారు. వీరు ప్రయాణిస్తుండగా.. అకస్మాత్తుగా బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో వీరు కిందపడటంతో గాయపడ్డారు. అటుగా వెళ్తున్న కారు యజమానులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. వీరిలో చంద్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అనంతపురం: అనంతపురం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. 5 అడుగుల ఎత్తు ఉండి, 50 సంవత్సరాల వయస్సు, వైట్ కలర్ ఫుల్‌షర్ట్, గ్రీన్‌కలర్ ఫుల్ అండర్‌వేర్, గ్రీన్ కలర్ లుంగీ, వైట్ కలర్ టవల్ ధరించిన వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం 12:50 గంటల సమయంలో రైల్వే స్టేషన్‌లో రైలు దాటుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు తెలిస్తే 9515935062 నంబర్ ఎస్.శ్రీరాములు (హెడ్‌కానిస్టేబుల్)కు ఫోన్ చేయవచ్చు.

ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

అనంతపురం టవర్‌క్లాక్: కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు రక్షణకరువైంది. ఉద్యోగులకు రక్షణ కల్పించాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయంగా ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సత్యసాయి జిల్లాలో బీసీ మంత్రులు ఉన్నప్పటికీ పెత్తనం మాత్రం టీడీపీ అగ్రకులాల నాయకులు చేస్తున్నారన్నారు. రక్షణ కల్పించేందుకు జిల్లా ఎస్పీలు, కలెక్టర్లు చొరవ చూపాలన్నారు.

3 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

అనంతపురం: కొడిమి జర్నలిస్ట్ కాలనీలో అక్టోబర్ 3 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఏపీఎస్‌డీటీ) చైర్మన్ మచ్చా రామలింగా రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి ఉన్న 10 నుంచి 25 సంవత్సరాల వయస్సుగల వారు, జర్నలిస్టు పిల్లలు ఉచితంగా శిక్షణ తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఉచిత శిక్షణ అనంతరం క్రికెటర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు.

నిబద్ధతతో కూడిన వ్యాఖ్యానమే విమర్శ



మట్టిపూలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం తదితరులు

అనంతపురం కల్చరల్: కవులు వ్యక్తీకరించిన కవిత్వాన్ని పాఠకుల మనసులో ముద్రించేలా చేసే నిబద్ధతతో కూడిన వ్యాఖ్యానమే కవితా విమర్శ అని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో తూముచర్ల రాజారాం రచించిన 'మట్టిపూలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చం.శాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ రాచపాలెం, బండి నారాయణస్వామితో పాటూ విమర్శకులు డాక్టర్ నాగేశ్వరాచారి, సీనియర్ కవి డాక్టర్ రాధేయ, పుస్తక సమీక్షకుడు డాక్టర్ అంకె శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. ఆధునిక సౌందర్యాత్మక విమర్శకుడైన రాజారామ్ కలం నుంచి జాలు వారిన మట్టిపూలు గ్రంథం చక్కటి విమర్శకు ప్రతిబింబమన్నారు. సీమ కవిత్వాన్ని రాస్తున్న కవులే రాయలసీమ కవులని.. ఆ బాటలోనే ప్రస్తుత గ్రంథం నడించిందని అభినందించారు. అనంతరం శేషాచారి ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, గోసల నారాయణస్వామి, ఉప్పరపాటి వెంకటేశులు, టీవీ రెడ్డి, రియాజుద్దీన్, డాక్టర్ ప్రగతి, అశ్వర్థరెడ్డి, జెట్టీ జయరామ్,సురేష్, ఈరన్న నబీరసూల్ పాల్గొన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్వామిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో పాటు బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ ప్రసాద్, ఆలయ ఈఓ బాబు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. అంతకుముందు ఎండోమెంట్ అధికారులకు ఆలయ అర్చకులు స్వామి వారి చిత్రపటాలు అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధుడిపై దాడి చేసి నగదు అపహరణ

అనంతపురం: ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఉన్న టీ కేఫ్‌లో కొండన్న అనే వృద్ధుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి నగదు దోచుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు మద్యం మత్తులో వచ్చిన ముగ్గురు యువకులు వృద్ధుడిని కట్టెలతో కొట్టారు. నగదును అపహరించుకుని వెళ్లారు. ఈ ఘటనలో గాయపడిన కొండన్నను చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. దాడి ఘటనకు సంబంధించిన ఘటనపై సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

సంతల ఆదాయం రూ.5.91 లక్షలు

అనంతపురం సెంట్రల్: స్థానిక గుత్తి రోడ్డు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన సంతల ద్వారా రూ.5.91 లక్షల ఆదాయం వచ్చినట్లు సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. శనివారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.3,42,370, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ. 2,49,110 మేర ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

గొర్రెల కాపర్లపై దాడి

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామంలో గొర్రెల కాపరులపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గంగాధర్, చిన్న గంగన్న గ్రామ సమీపంలోని వంక వద్ద గొర్రెలు మేపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు, ప్రకాష్‌తో పాటు మరికొంత మంది దాడి చేశారు. గ్రామంలో వినాయక చవితి పండుగ రోజున చిన్నపాటి గొడవ జరిగిందని, దాన్ని మనసులో ఉంచుకుని తమపై దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఆదివారం సాయంత్రం ఓ ట్రాక్టర్‌లో పెన్నానది నుంచి ఇసుక నింపుకుని ఎటువంటి బిల్లు లేకుండా నిట్టూరు గ్రామం మీదుగా తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న లారీ

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఓ లారీ రోడ్డు డివైడర్‌ను ఢీ కొన్న ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. తాడిపత్రి నుంచి బెంగుళూరుకు సిమెంట్‌తో వెళ్తున్న లారీ ధర్మవరం వైపు నుంచి బత్తలపల్లికి వస్తున్న వాహనం లైటింగ్ పోకస్‌కు బైపాస్ బ్రిడ్జి వద్ద ఎదరుగా ఉన్న డివైడర్లను గుర్తించక ఢీ కొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలతో బయటపడగా లారీ దెబ్బతింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదని సమాచారం. నూతనంగా నిర్మాణం చేపట్టిన బైపాస్ రోడ్డులో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

దిగుబడి దిగాలు!



ఆత్మకూరు వద్ద వేరుశనగను కుప్పలుగా ఉంచిన దృశ్యం



వేరుశనగను తొలగిస్తున్న కూలీలు

ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, ఆముదం దిగుబడి భారీగా తగ్గిపోయింది. వర్షాకాలం ప్రారంభంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడంతో రైతులు ఉత్సాహంగా పంటలు సాగు చేశారు. ఆముదం 3,500 హెక్టార్లు, వేరుశనగ 5,000 హెక్టార్ల వరకూ సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పంటల్లో కలుపుతీత పనుల అనంతరం వరుణుడు ముఖం చాటేశాడు. దిగుబడి పడిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఆదివారం ఆత్మకూరు సమీపంలో సాగు చేసిన వేరుశనగ పంట తొలగింపు పనులు చేపట్టారు. వేరుశనగను కుప్పలుగా వేసిన అనంతరం వర్షం కురవడంతో తడిసిపోయింది. పశువులకు మేత కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు. కాగా.. వేరుశనగ తొలగించేందుకు వచ్చిన ఒక్కో కూలీకి రూ.300 చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. – ఆత్మకూరు:

జూదరుల అరెస్ట్



అరెస్ట్ చేసిన జూదరులతో సీఐ సాయిప్రసాద్

తాడిపత్రి అర్బన్: పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేశామని అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని నంద్యాల రోడ్డులో పేకాటాడుతున్నారన్న సమాచారం అందుకున్న సీఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో పట్టణానికి చెందిన సోమల కొండారెడ్డి, జూటూరు బాలిరెడ్డి, శివకుమార్, జూటూరు అమర్నాథ్, గాలి వేణుగోపాల్‌రెడ్డి, కొండు రామసుబ్బారెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.32,280 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగండి

పట్టణంలో శాంతిభద్రతలకు, ప్రశాంత జీవనానికి భంగం కల్గిస్తే కఠినచర్యలు తప్పవని అర్బన్ సీఐ సాయిప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటరర్లు, మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజా జీవనానికి విఘాతం కల్గించకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.